క్లుప్తంగా

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: భరతమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకుని విజయ్ దివస్ సందర్భంగా జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు బి. త్రిమూర్తులు, శశికళ, కరణం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఏఎస్ఎన్ఎం కళాశాలలో నాక్ బృందం పర్యటన

పాలకొల్లు సెంట్రల్: ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో గురువారం నాక్ కమిటీ సభ్యులు పర్యటించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఇప్పటి వరకూ కళాశాల రెండు పర్యాయాలు నాక్‌కు ఎంపికైందని అన్నారు. ప్రస్తుతం రెండు రోజుల పాటు కళాశాలలో నాక్ టీం సభ్యులు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

మంగారావుకు పరామర్శ


విశాఖ కేజీహెచ్‌లో మంగారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పాము కాటుతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆచంట వేమవరం వైఎస్సార్ సీపీ నాయకుడు గెద్దాడ మంగారావును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. ఇటీవల పాముకాటుతో మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో చేర్పించడంతో బుధవారం విశాఖ వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

మంచినీటి చెరువు విస్తీర్ణం పెంపు


కొత్తపేట మంచినీటి చెరువు

పాలకొల్లు అర్బన్: మండలంలోని కొత్తపేట మంచినీటి చెరువు విస్తీర్ణం పెరిగింది. గ్రామానికి చెందిన గొల్లమందుల పోలు వద్ద నుంచి సుమారు 20 సెంట్లు స్థల సేకరణ చేశారు. ఈ స్థల సేకరణ చెరువుకి తూర్పుభాగంలో చేశారు. ఈ చెరువును గత జూన్ నెలలో ప్రొక్లెయిన్‌తో తవ్వారు. దీంతో చెరువు విస్తీర్ణం పెరిగింది. వేసవి కాలంలోనూ ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడానికి అనువుగా ఉంది. చెరువు విస్తీర్ణం పెరగడానికి స్థలం ఇచ్చిన పోలుకు గ్రామ సర్పంచ్ కవురు భారతి, వైసీపీ నాయకుడు కవురు భాస్కరబాబు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

1న మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

నరసాపురం రూరల్: స్థానిక మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 1న మంగళవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

వాన హోరు.. వరినాట్ల జోరు

- ముమ్మరంగా వరినాట్లు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు, వ్యవసాయ కూలీలు
- పాలకొల్లు సబ్ డివిజన్‌లో 10 శాతం వరినాట్లు పూర్తి


దగ్గులూరులో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు


పాలకొల్లు మండలం లంకలకోడేరులో ఏపుగా పెరిగిన నారుమడి


పాలకొల్లు మండలం లంకలకోడేరులో నాట్లు వేయడానికి సిద్ధం చేసిన వ్యవసాయ భూమి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు సబ్ డివిజనల్‌లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో పాటు గోదావరికి వరద నీరు పెరగడంతో రైతులు నాట్లు వేసుకోవడానికి ఆలోచిస్తున్నారు. నారుమడి ఏపుగా పెరిగి నాట్లు వేయడానికి సిద్ధంగా ఉంది. సబ్ డివిజన్‌లో 20 శాతం నాట్లు పూర్తయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం వరినాట్లు వేసుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. దమ్ములు చేసుకుని నేల చదును చేసుకుంటున్నారు. దీంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. మహిళా కూలీలతో నాట్లు వేయడానికి రైతులు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

మండలం	వరి విస్తీర్ణం (ఎకరాల్లో)	నాట్లు వేసినది (ఎకరాల్లో)
పాలకొల్లు	10,956	452
పోడూరు	14,831	1953
ఆచంట	11,028	1408
మొత్తం	36,815	3,844

కాజ స్లూయిజ్ వల్ల నష్టం

గోదావరి వరద రావడంతో కాజ డ్రెయిన్ శివారున ఏనుగువానిలంక వద్ద అవుట్ ఫాల్స్ స్లూయిజ్ మరమ్మతులు చేయకపోవడంతో రైతులు అందోళన వ్యక్తం చేశారు. యలమంచిలి, పాలకొల్లు మండలాల్లోని వ్యవసాయ భూములు గోదావరి వరద నీరు ఏనుగువానిలంక వద్ద అవుట్ ఫాల్స్ స్లూయిజ్ కాజ డ్రెయిన్‌లోకి చేరి వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం స్లూయిస్ మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

60:40:40 మోతాదులో ఎరువులు వాడాలి

ప్రస్తుతం సార్వా నాట్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలంటున్నారు. హెక్టారుకి నత్రజని, బాస్వరం, పొటాష్‌లను 60:40:40 మోతాదులో వేయాలంటున్నారు. నత్రజని 60 శాతం మూడు దశలుగా వాడాలంటున్నారు. దమ్ములో, పిలకల దశలోనూ, చిరుపొట్ట దశలో నత్రజని ఎరువులు వాడాలంటున్నారు. ప్రస్తుతం తెగుళ్ల బెడద లేదంటున్నారు. మొత్తం వరినాట్ల జోరు పెరగడంతో పొలాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

కరోనా సమయంలో సేవలు భేష్



కరోనా సమయంలో మా వలంటీర్ శ్రీలక్ష్మి చాలా సేవలందించింది. గ్రామంలో దాతల సహకారంతో కాయగూరలు తెచ్చి ఇచ్చింది. ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ద్వారా మేము లబ్ధి పొందాము. వైఎస్సార్ చేయూత, వాహనమిత్ర, రైతు భరోసా పథకాలను మా వలంటీర్ ద్వారా మాకు అందుతున్నాయి. మాకు ముగ్గురు ఆడపిల్లలు. నాభర్త చంద్రరావు కౌలురైతు. ఆటో డ్రైవర్‌గాకూడా పనిచేస్తారు. దీంతో వాహనమిత్ర ద్వారా ఏడాదికి రూ.10వేలు అందుతున్నాయి.

– గుబ్బల లక్ష్మి, సగంచెరువు

పథకాలు అందుకుంటున్నా



సీఎం జగన్ అందిస్తున్న నవరత్నాల పథకాల్లో నాకు నాలుగు పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నా. నా భర్త చంద్రరావు టైలరింగ్ చేస్తాంు. చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10వేలు అందుతున్నాయి. అలాగే కాపునేస్తం, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకాలు ద్వారా లబ్ధి చేకూరుతోంది. మా వలంటీర్ మన్నె రాణి ఆన్‌లైన్ చేసి పథకాలు సక్రమంగా అందిస్తుంది. పథకా లు అందించడంలో వలంటీర్ల సేవలు బాగున్నాయి.

– మండెల రత్నవేణి, గోరింటాడ

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


నరసాపురంలో గోదావరి వరద ఉధృతిని పరిశీలిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


ఇలపర్రులో వరి చేలల్లోకి భారీగా చేరిన వర్షపు నీరు

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో వరదనీరు గోదావరిలోకి చేరడంతో అంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం పట్టణ పరిధిలోని పొన్నపల్లి, వలందరరేవు తదితర ప్రాంతాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గోదావరి వరద ఉధృతిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీటి మట్టం పెరుగుతుందని, రానున్న 24 గంటలలో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు ఎక్కడైతే ఏటి గట్లు బలహీనంగా ఉన్నాయో అక్కడ ముందస్తుగా ఏటిగట్ల అభివృద్ధి శాఖ ఇసుక బస్తాలు సిద్ధం చేయాలన్నారు. పొన్నపల్లి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేసి నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ప్రసాదరాజు తెలిపారు. పొన్నపల్లిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సాయంతో బయటకు మళ్లించాలని అధికారులకు సూచించారు. స్థానికంగా నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేసి పూర్తిస్థాయిలో శానిటేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేయాలని చీఫ్‌విప్ ప్రసాదరాజు అన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు, మున్సిపల్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, రెడ్డప్ప ధవేజీ, మల్లాడి బుజ్జి, శేఖర్, జాన్‌కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మొగల్తూరులో 59.6 మీమీ వర్షపాతం

మొగల్తూరు: మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తునే ఉన్నాయి. ఆదివారం రాత్రి నుండి బుధవారం ఉదయం వరుకు సుమారు 59.6 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లోనూ వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరులోని మసీదు వీధి, స్టేషన్ రోడ్, పాతకాలువ, పేరుపాలెం, కేపీ పాలెం ఉన్నత పాఠశాల సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయింది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పెనుగొండ, ఆచంట మండలాల్లో శివారు ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిద్ధాంతం అరుంధతీ పేట, చినమల్లం కాలనీల్లో, వడలి, పెనుగొండల్లోని కాలనీల్లో రోడ్లపై నీరు చేరుకొని సాయంత్రం వరకూ నిలిచిపోయింది. వరిచేలల్లోకి నీరు భారీగా చేరుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆచంట వేమవరంలో వరి చేలు ముంపునకు గురయ్యాయి, వరి నాట్లు ఇంకా పూర్తి కాకపోవడంతో కొందరు రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తి కావడంతో పలువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజులు ఇదే విధంగా కురిస్తే నారు కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో అధికంగా ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు.

వరదల్లో కూడా డ్రాప్‌అవుట్స్‌పై దృష్టి


డ్రాప్ అవుట్స్ పిల్లలను స్కూల్లో అప్పగిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం రూరల్: విద్యార్థులు చదువుకుంటేనే భవిష్యత్ అని, వారు జీవితాల్లో పైకి వస్తారని నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ అన్నారు. వర్షాల నేపథ్యంలో ఆయన బుధవారం తీర ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేస్తూ నవరసపురం ఎస్టీ కాలనీని సందర్శించారు. ప్రజలు యోగక్షేమాలు తెలుసుకోవడంలో భాగంగా స్కూల్‌కి, కాలేజీకి వెళ్లకుండా దుబారాగా తిరుగుతున్న పలువురు విద్యార్థులను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకు ఎగనామం ఎందుకు పెట్టారనే విషయాలు తెలుసుకుని వెంటనే వారిని సంబంధిత విద్యాసంస్థల్లో చేర్పేందుకు ఉపక్రమించారు. ఎస్టీ కాలనీలో మేడా ఏసురత్నం, గంధం సాజన్యలను వెంటనే తన కారులో ఎక్కించుకుని ఒకరిని నరసాపురం పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలోనూ, మరొకరిని వైఎన్ కళాశాలలో అప్పగించి అడ్మిషన్ రీఓపెన్ చేయించారు. కస్తూరిబా గాంధీ స్కూల్‌లో ఏసురత్నం ఎందుకు మానేశాడనే విషయంపై అక్కడి హెడ్ మాస్టర్ నల్లం రాజును వివరాలు అడిగారు. నవరసపురం నుంచి నరసాపురం వరకూ ఎస్టీ కాలనీ విద్యార్థులు రావడం కోసం నెలకు రూ.8 వేలు సొంత ఖర్చులతో ఆటో ఏర్పాటు చేశానని అయినప్పటికీ వారు రావడంలేదనే విషయాన్ని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. హెచ్ఎం రాజు దాతృత్వాన్ని ఈ సందర్భంగా ఆయన మెచ్చుకున్నారు. విద్యార్థులకు చదువుపై మక్కువ పెంచేలా ఆలోచన చేయాలని అక్కడి ఉపాధ్యాయులకు సబ్ కలెక్టర్ సూర్యతేజ హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంట నరసాపురం తహసీల్దార్ ఫాజిల్, డీఎస్పీ రవిమనోహరాచారి, ఎంఈవో పుష్పరాజ్యం, ఎస్సై సుధాకరరెడ్డి తదితరులు ఉన్నారు.

కాళీపట్నం భూములు పేదలకు పంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం

మొగల్తూరు: కాళీపట్నం జమీందారి భూములను పేదలకు పంచాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.బలరాం డిమాండ్ చేశారు. బుధవారం మొగల్తూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కాళీపట్నం భూములు సమస్యపై అనేక పోరాటాలు చేశాయన్నారు. కాళీపట్నం భూములను సర్వే చేసి పేదలకు పంచేలా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు యడ్ల చిట్టిబాబు, కొత్త విజయకుమార్, ముప్వల రాజారావు, కొత్తపల్లి నాగరాజు, వీర పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కాంబొట్లపాలెంలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ

యలమంచిలి: రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. కాంబొట్లపాలెం, చింతదిబ్బ గ్రామాలకు సంబంధించి బుధవారం కాంబొట్లపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలన్నీ ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా ఎగ్గొట్టాలా అని ఆలోచనతో ప్రభుత్వ పథకాల అమలుకు అనేక నిబంధనలు పెట్టి అర్హుల సంఖ్య తగ్గించడానికి శతవిధాల కృషి చేసేవన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అందుకోవడానికి ఏ చిన్న అవరోధం ఉన్న వాటిని తొలగించి ఆ పథకాలను ప్రజలకు అందించడానికి జగనన్న సురక్ష పథకం ద్వారా శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ప్రజలు గత ప్రభుత్వాలకు జగనన్న ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రెండు గ్రామాల సర్పంచ్‌లు అనిశెట్టి మల్లిక, చిలుకూరి సూనావతి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు శీలం వీరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు పార్టీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, మంద హరికుమార్, అనిశెట్టి నవీన్, అనిశెట్టి జయరాజు, అనిశెట్టి ధర్మారావు, బండి శ్రీను, అంతర్వేది సీతారాముడు, మంద పెద్దిరాజు, రాయుడు లీలేశ్వరుడు, అనిశెట్టి గంగన్న, వీరా ఉమాశంకర్ ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతులు పడుతున్న సమస్యలపై స్పందించి సమావేశం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం స్థానిక ఆక్వా సంఘం భవనంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోం ఇటీవల ఆక్వా రైతులు సమావేశం ఏర్పాటు చేసి సంఘం నూతన కమిటినీ ఎన్నుకుందన్నారు. సమస్యలపై ప్రభుత్వం ఆక్వా రైతుల కోసం ఏర్పాటు చేసిన అప్సా కమిటీతో ఇటీవల సమావేశం నిర్వహించి సమస్యలను తెలియజేశామన్నారు. వారం రోజుల్లోనే స్పందించిన ప్రభుత్వం అప్సా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో ఈ నెల 31న కాకినాడలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్, ఫీడింగ్ యూనిట్ సంస్థలతో సమావేశం ఏర్పాటు చేయడం ఆక్వా రైతులకు శుభపరిణామమని అన్నారు. ఆక్వా రైతులు పెద్ద ఎత్తున సంఘంలో చేరితే సంఘం బలపడుతుందన్నారు. సంఘం బలంగా ఉంటే మన సమస్యలు కూడా సునాయాసంగా పరిష్కారం అవుతాయని తెలిపారు. కాకినాడలో జరగనున్న సమావేశంలో సంఘం నుండి ఇద్దరు సభ్యులకు ఆహ్వానం అందిందని తెలిపారు. ఈ సంఘంలో పాలకొల్లు, నరసాపురం, ఆచంట ఆక్వా రైతుల సమస్యలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ బోణం చినబాబు, జాన్‌రాజు, కోడి విజయబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అరాచకాలను అరికట్టాలి


గుమ్మలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

పోడూరు: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలను తక్షణ మే అరికట్టాలని డిమాండ్ చేస్తూ గుమ్మలూరు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బుధవారం అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ నాయకురాలు పీతల రాజమణి మాట్లాడుతూ మణిపూర్ లో మహిళలను దారుణంగా హింసిస్తున్న మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.అమ్మాజీ, ఐ.బేబీ, జి.మంగతాయారు, పి.విమల, సీహెచ్.రత్నకుమారి, ఆశా వర్కర్లు నాగమణి, కృష్ణవేణి, పుష్పలత, కె.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలోని చేపల మార్కెట్ ప్రాంతంలో పేకాడుతున్న వీరిపై దాడి చేసి పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి రూ.4,250 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

29 నుంచి సంగీతోత్సవాలు

పెనుగొండ: స్థానిక త్యాగరాజ కళాభవనంలో 38వ సంగీతోత్సవాలు ఈ నెల 29 నుంచి 31 వరకూ నిర్వహించనున్నట్లు త్యాగరాజ గాన సభ అధ్యక్షురాలు డాక్టర్ కలిదిండి అన్నపూర్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 29న యువగాయని కొమ్మా జోశ్యుల అలేఖ్య గాత్ర సంగీత విభావరి, 30న సంగీత విద్వన్మణి వేలూరి తులసీ విశ్వనాథ్ గాత్ర సంగీత విభావరి, 31న నృత్య విభావరి, సంగీత విభావరిని నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగీత ప్రియులు, గ్రామస్తులు సంగీతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంగీత అధ్యాపకురాలు గుత్తిన అన్నపూర్ణ పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో రోడ్డు నిర్మాణం


ఇందిర శాంతినగర్‌లో రహదారి నిర్మిస్తున్న దృశ్యం

పెనుగొండ: గడపగడపకూ మన ప్రభుత్వ నిధులతో పెనుగొండ ఇందిర శాంతి నగర్‌లో రహదారి నిర్మాణం చేపట్టారు. రూ.5 లక్షల నిధులతో రహదారి నిర్మాణం చేపట్టడంతో ఇబ్బందులు తప్పాయని స్థానికులు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో రహదారి ఇబ్బందులు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు విన్నవించుకోవడంతో సత్వరం స్పందించి నిధులు మంజూరు చేయడంతో రహదారి నిర్మాణం పూర్తి చేశారు.